మందుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి

వరంగల్, అక్టోబర్ 14 : సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి పీహెచ్‌సీలకు వస్తున్న మందుల వివరాలతో పాటు పేషెంట్స్‌కు ఇస్తున్న వివరాలను ఔషధ పోర్టల్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్‌వో లలితాదేవి సూచించారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఫార్మాసిస్ట్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మందుల లభ్యత, ప్రత్యేక శిబిరాల్లో అందజేస్తున్న మందుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గడువు ముగిసిన మందులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రేబిస్, స్నేక్ యాంటీ వెనమ్ ఎప్పుడూ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఫార్మసీ ఇన్‌చార్జి శరత్‌బాబు, సెంట్రల్ డ్రగ్ స్టోర్ డీఈవో రజినీకాంత్, క్రాంతి పాల్గొన్నారు.

దళితబంధు వెంటనే అందజేయాలి

దామెర, అక్టోబర్ 14 : మండలంలో అర్హులైన దళితులకు ప్రభుత్వం వెంటనే దళితబంధు పథకం వర్తింపజేసి ఆదుకోవాలని మాజీ ఎంపీపీ కాగితాల శంకర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఈ పథకం కోసం పది నెలలుగా ఎదురు చూస్తున్నారన్నారు. అర్హులకు ఇప్పటికే ప్రొసీడింగ్స్ కాపీలను అందించారని, కానీ పథకం కింద వచ్చే రూ.10లక్షలను ఇప్పటివరకు అందించకపోవడం దారుణమన్నారు.

బైకు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

హసన్‌పర్తి, అక్టోబర్ 14 : బైకు ఢీ కొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. పెంబర్తికి చెందిన కొయ్యడ నవీన్ (22) గ్రామంలో సొరం శంకర్ ఇంటి ముందు ఈ నెల 12న ఫోన్ మాట్లాడుతుండగా, ఇదే గ్రామానికి చెందిన కొయ్యడ ప్రశాంత్ బైకుపై అతివేగంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో నవీన్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు నవీన్‌ను ఎంజీఎం దవాఖానకు తరలించారు. బాధితుడి తండ్రి జంపయ్య సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న చాగంటి శ్రీనివాస్

16, 17న అండర్- 23 క్రికెట్ ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 14 : ఈ నెల 16, 17 తేదీల్లో దేశాయిపేట లోని సీకేఎం క్రీడా మైదానంలో అండర్-23 క్రికెట్ జట్లను ఎంపిక చేయనున్నట్లు వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆఫీస్‌లో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు జిల్లాల పరిధిలో అండర్-23 ఇంట్రాడిస్ట్రిక్ట్ లీగ్ టోర్నమెంట్‌ను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో ఈ నెల 20 నుంచి 23 వరకు జరిపేందుకు తీర్మానం చేసినట్లు చెప్పారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జట్లను ఎంపిక చేస్తామని, 1 సెప్టెంబర్, 2001 నుంచి జన్మించిన వారు ఆధార్‌కార్డు, మీ-సేవ నుంచి పొందిన బర్త్ సర్టిఫికెట్‌తో సొంత క్రికెట్ కిట్‌తో హాజరుకావాలని కోరారు.

సుభాష్ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

జర్నలిస్టు సుభాష్ మృతి తీరనిలోటు

నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 14 : సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రజ్యోతి క్రైం రిపోర్టర్ నాయకపు సుభాష్ సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. సుభాష్ అకాల మృతిపై టీయూడబ్ల్యూజే(143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపల్లి మధు, రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, వేణుమాధవ్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య సంతాపం తెలిపారు. ఆయన మృతి సమాజం, జర్నలిస్టు లోకానికి తీరని లోటు అని అన్నారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, మార్నేని రవీందర్‌రావు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కుటుంబసభ్యులకు దాస్యం పరామర్శ..

కాజీపేట : భీమారంలోని సుభాష్ గృహంలో ఆయన పార్థివదేహంపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించి అంతమ యాత్రలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, పశ్చిమ నియోజక వర్గ కో ఆర్డినేటర్ పులి రజినీ కాంత్, కార్పొరేటర్ సంకు నర్సింగ్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కాలేజీ అధ్యాపకుడు సురేశ్‌కు నివాళి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 14 : కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ వాణిజ్యశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కావలి సురేశ్ మృతి చెందగా, సోమవారం కాలేజీలో ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

చెత్త నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలి

- సీడీఎంఏ వీపీ గౌతమ్
- పోతననగర్‌లోని చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్, ల్యాండ్రోమార్ట్ పరిశీలన
- హాజరైన మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ల్యాండ్రోమార్ట్‌ను పరిశీలించి అధికారితో మాట్లాడుతున్న సీడీఎంఏ వీపీ గౌతమ్ పక్కన మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, అక్టోబర్ 14 : గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో చెత్త నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని సీడీఎంఏ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన పోతననగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, ల్యాండ్రోమార్ట్‌ను మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి సందర్శించారు. గృహాల నుంచి సేకరించిన చెత్తను కంపాక్టర్ బిన్లకు పంపించే విధానాన్ని పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణ నుంచి డంపింగ్ యార్డ్‌కు చేరే వరకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. ప్రతి రోజు ఎంత చెత్తను సేకరిస్తున్నారు. డంపింగ్ యార్డ్‌కు ఎంత తరలిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ల్యాండ్రో మార్ట్‌ను పరిశీలించిన ఆయన అక్కడ యంత్రాల పని తీరును తెలుసుకున్నారు. మార్ట్‌లో రజక సంఘాలు, రజక స్వయం సహాయక బృందాల సభ్యులు సుమారు 100 మందికి ఉపాధి కల్పిస్తామన్నారు.

ఐసీసీసీ పరిశీలన..

కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సీడీఎంఏ పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ కెమెరాలు, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఏసీటీఎస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిస్టమ్‌ను పోలీసులే మానిటరింగ్ చేయాలన్నారు. ఆ సిస్టమ్‌ను పోలీసులకు అప్పగించాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం కేటాయించిన వాహనాలను వేరు వేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్, డంపింగ్ యార్డుకు వెళ్లే వాహనాలను ప్రతి రోజూ బల్దియా అధికారులు మానిటరింగ్ చేయాలన్నారు. వాహనాల సమాచారాన్ని ఐసీసీసీకి అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఎం షాహిద్ మసూద్, అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఎస్ఈలు రాజయ్య, ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఎచ్‌వో రమేశ్, సిటీ ప్లానర్ రవీంద్ర రాదేకర్, ఎంహెచ్‌వో రాజేశ్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, డీఎంసీ రజితారాణి, రేణుక, టీఎంసీ రమేశ్ పాల్గొన్నారు.

'రూ.4వేల పెన్షన్ ఎప్పుడిస్తరో ప్రకటన చేయాలి'

శాయంపేట, అక్టోబర్ 14 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.4వేల పెన్షన ఎప్పుడు ఇస్తారో ప్రకటన చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్ కోరారు. శాయంపేటలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో పెద్ద సంఖ్యలో వితంతులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడుస్తున్నదన్నారు. అయినా పెన్షన్ రాకపోవడం ప్రభుత్వం నిర్లక్ష్యమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వితంతువులకు అన్యాయం చేస్తున్నదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు సుమన్, రాజు, రమేశ్, వినయ్ పాల్గొన్నారు.

సిద్ధేశ్వరునికి లక్ష పుష్పార్చన

హనుమకొండ, అక్టోబర్ 14 : హనుమకొండ పద్మాక్షి కాలనీలోని స్వయంభూ దేవాలయంలోని సిద్ధేశ్వరస్వామికి ఆశ్వయుజ సోమవారం సందర్భంగా లక్ష పుష్పార్చన చేసినట్లు అర్చకుడు సిద్ధేశుని రవికుమార్, సురేశ్‌కుమార్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఏటీఎం కార్డు మార్చేసి.. రూ.20 వేలు దోచేసి..

కాజీపేట, అక్టోబర్ 14 : కాజీపేటలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఓ వృద్ధుడికి చెందిన ఏటీఎం కార్డును మార్చేసి రూ.20 వేలు డ్రా చేసుకుని మోసం చేసిన ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. బాధితుడు బోయిని కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కొమురయ్య పట్టణంలోని ఏటీఎం కేంద్రంలో డబ్బులను డ్రా చేసుకునేందుకు వెళ్లాడు. కొమురయ్యకు డబ్బులు డ్రా చేసుకోవడం రాకపోవడంతో అక్కడే ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి గమనించి తాను సాయం చేస్తానని నమ్మించి ఆ కార్డును తీసుకుని మార్చేసి మరో కార్డును మిషన్‌లో పెట్టి పిన్ నంబర్ ఎంటర్ చేయమన్నాడు. వృద్ధుడు పిన్ నంబర్ ఎంటర్ చేయగా, డబ్బులు డ్రా కాకపోవడంతో కార్డును తీసుకుని కొమురయ్య వెళ్లిపోయాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత బాధితుడు కొమురయ్య సెల్‌కు రూ.20 వేలు డ్రా అయినట్లు సమాచారం వచ్చింది. తాను మోసపోయానని గమనించిన కొమురయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

కార్యకర్తలను మంత్రి సమన్వయం చేయాలి

- దాడి చేసిన వారికే వంతపాడడం సరికాదు
- పలువురు కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు, అక్టోబర్ 14 : కార్యకర్తలను సమన్వయం చేయాల్సిన బాధ్యత మంత్రి కొండా సురేఖపై ఉందని, అలా చేయకుండా దాడి చేసి గాయపర్చిన వారిని ప్రోత్సహించడం ఎంత వరకు సమంజసమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కమలాపురం రమేశ్ ప్రశ్నించారు. సోమవారం ఆత్మకూరులో ఆయన మాట్లాడుతూ.. దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఫొటోను ఫ్లెక్సీలో ఎందుకు పెట్టలేదని అక్కడ ఉన్న కాంగ్రెస్ నాయకులను కార్యకర్త అనిల్ ప్రశ్నించగా, కొండా వర్గీయులు 40 మంది అనిల్ ఇంటికి వెళ్లి చితక బాధాకరమన్నారు. ఈ ఘటనపై మంత్రి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి దాడి చేసిన కార్యకర్తలను ప్రోత్సహించడం సరికాదన్నారు. మంత్రి హోదాలో ఉండి అధికారులతో దురుసుగా ప్రవర్తించడంపై కార్యకర్తలు జీర్ణంచకోలేక పోతున్నారని చెప్పారు. పరకాల నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త ఎమ్మెల్యే రేవూరికి అండగా ఉంటామన్నారు. సమావేశంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్లు బీరం సుధాకర్‌రెడ్డి, ఏరుకొండ రవీందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోరిగం స్వామి, మాజీ ఎంపీటీసీ రజిత-వాసు, మాజీ సర్పంచ్‌లు పర్వతగిరి రాజు, కంచె రవికుమార్, పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో లేకపోవడం బాధాకరం..

దామెర : మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. దసరా పండుగ సందర్భంగా ధర్మారంలో కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఫొటో లేకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ నాయకుడు పిట్టల అనిల్‌పై కొంత మంది దాడి చేసి గాయపర్చడం హేయమైన చర్యగా భావించి తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సమావేశంలో గుడిపాటి శ్రీధర్‌రెడ్డి, కునాటి రామకృష్ణ, జన్ను రాంచందర్, జక్కుల రవి, కిన్నెర కోరి తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళీని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వరంగల్, అక్టోబర్ 14 : నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ అమ్మవారిని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి దర్శించుకున్నారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన కిషన్‌రెడ్డికి ఈవో శేషుభారతి, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వల్లభ గణపతి, భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మహా మండపంలో అర్చకులు మహాశీర్వచనం ఇచ్చి అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించి, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కోరితే కేంద్ర టూరిజం శాఖ ధ్వర్యంలో భద్రకాళీ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కలెక్టర్ ప్రావీణ్య, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, డాక్టర్లు కాళీప్రసాద్, విజయచందర్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని వినతి..

హనుమకొండ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని టీఎన్జీవో నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని టీఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో సభ్యులు కోరారు. ఉద్యోగుల ఇన్‌కమ్ ట్యాక్స్ పరిధిని పెంచాలన్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కేంద్ర సంఘం నేతలు శ్యామ్ సుందర్, లక్ష్మీప్రసాద్, నేతలు రాజీవ్‌రాజ్, రాజమౌళి, శ్రీనివాస్, రాజేశ్‌ఖన్నా, అనూప్, ప్రణయ్, శివ పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి రైల్వే ఎంప్లాయీస్ జేఏసీ కృతజ్ఞతలు..

కాజీపేట : నగరానికి విచ్చేసిన కేంద్ర మంత్రిని హనుమకొండలోని బీజేపీ కార్యాలయంలో తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి కాజీపేట రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను కోచ్ ఫ్యాక్టరీకి అప్‌గ్రేడ్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాజీపేట రైల్వే జంక్షన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయడంతో పాటు రైల్వే డివిజన్ ఏర్పాటుకు పాటుపడుతామన్నారు. కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు, కో- కన్వీనర్లు తిరుపతి, శ్రీనివాస్, భాస్కర్, మహేశ్ పాల్గొన్నారు.

నేడు కొత్త టీచర్లకు పాఠశాలల కేటాయింపు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 14 : జిల్లాలో నియామకమైన 169 మంది కొత్త టీచర్లు తమ నియామక ఉత్తర్వులు, అన్ని నిజపత్రాలతో ఈ నెల 15న ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం(ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్)లో హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి తెలిపారు. కొత్త టీచర్లకు పాఠశాలల కేటాయింపునకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

హనుమకొండ బస్‌స్టేషన్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

కిక్కిరిసిన హనుమకొండ బస్‌స్టేషన్

సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 14 : హనుమకొండ బస్‌స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. దసరా సెలువుల ముగియడంతో హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు అధిక సంఖ్యలో బస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. దీంతో హైదరాబాద్, ఉప్పల్ ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు నిండిపోయాయి. సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు తిరిగి పట్టణ బాటపడుతున్నారు. సరిపడా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. వచ్చిన ఒక్క బస్సు సైతం ఎక్కేందుకు ఎగబడ్డారు. బస్సులో సీటు కోసం కిటికీలోంచి కూడా ఎక్కారు. ఆర్టీసీ అధికారులు దసరా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినప్పటికీ సమయానికి రాకపోవడంతో అవస్థలు తప్పలేదు. మరోవైపు స్పెషల్ బస్సులకు పెంచిన చార్జీలు ప్రయాణికులకు భారంగా మారాయి.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంపై దృష్టిపెట్టాలి

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, అక్టోబర్ 14 : బల్దియా గ్రీవెన్స్‌లో బాధితులు అందజేసిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను దేశించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కమిషనర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. 41వ డివిజన్ పరిధిలోని బక్షి మహల్‌లో రోడ్డు, డ్రైనేజీ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకవచ్చారు. ఇంటి నిర్మాణ అనుమతి కోసం 2019లో దరఖాస్తు చేసుకుని 2020లో రూ.1,12,283 ఫీజు చెల్లించామని, అయినా ఇప్పటి వరకు పర్మిషన్ ఇవ్వడం లేదని పైడిపల్లి గ్రామానికి చెందిన పంచగిరి సంధ్య కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. హనుమకొండ స్నేహనగర్ రోడ్డు నంబర్ 12లో 3 ఫీట్ల రోడ్డు ఆక్రమించుకొని ప్రహరీ నిర్మించారని గ్రీవెన్స్‌లో స్థానికులు ఫిర్యాదు చేశారు. 47వ డివిజన్ రాంనగర్‌లో రోడ్డుపై అక్రమంగా నిర్మించిన గద్దెలను తొలగించాలని స్థానికులు అర్జీ అందజేశారు. పోస్టల్ కాలనీలోని 40 ఫీట్ల లే అవుట్ రోడ్డులో అక్రమ నిర్మాణాలను తొలగించాలని కాలనీ అభివృద్ధి కమిటీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ గ్రీవెన్స్‌లో 56 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 39, ఇంజినీరింగ్ విభాగం 6, ప్రజారోగ్య విభాగం 5, పన్నుల విభాగం 2, తాగునీటి సరఫరాపై 4 వినతులు వచ్చాయి. గ్రీవెన్స్‌లో అదనపు కమిషనర్ రాజేందర్ రెడ్డి, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, హెచ్‌వో రమేశ్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాదేకర్, డీఎఫ్‌వో శంకర లింగం, టీపీఆర్వో కోలా రాజేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ కమిషనర్‌లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ట్యాక్సేషన్ అధికారి బిర్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బల్దియా గ్రీవెన్స్‌లో బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ల్యాదెళ్లలో ముళ్లపొదలతో నిండిపోయిన క్రీడాప్రాంగణం

క్రీడా ప్రాంగణం నిండా ముళ్ల పొదలే..

కన్నెత్తి చూడని అధికారులు

దామెర, అక్టోబర్ 14 : మండలంలోని ల్యాదెళ్లలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం ముళ్లపొదలతో నిండిపోయింది. గత ప్రభుత్వం గ్రామీణ క్రీడలకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో ఈజీఎస్ పథకం కింద ప్రతీ గ్రామంలో క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. ఇందు కోసం రూ.2లక్షల నిధులను కేటాయించింది. ల్యాదెళ్ల సమీపంలోని గుట్టకు ఆనుకుని క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. అయితే క్రీడా స్థలాన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో ముళ్లపొదలు ఏపుగా పెరిగి నిరుపయోగంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారాయని పలువురు క్రీడాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముళ్లపొదలను తొలగించి క్రీడాస్థలాన్ని అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు, ప్రజలు కోరుతున్నారు.

వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

ప్రజావాణికి 52 దరఖాస్తులు

హనుమకొండ, అక్టోబర్ 14 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై 52 విజ్ఞప్తులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్ బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. దరఖాస్తుల్లో తహసీల్దార్ కార్యాలయాలు, జీడబ్ల్యూఎంసీ, గ్రామాల్లో జరిగిన అవినీతి, రుణమాఫీ తదితర సమస్యలపై ఎక్కువగా వచ్చాయి. కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేశ్ పాల్గొన్నారు.

బల్దియా ఎదుట ఆందోళన చేస్తున్న 29వ డివిజన్ ప్రజలు

కలుషిత తాగునీటి సరఫరాపై జనం ఆగ్రహం

బల్దియా ఎదుట ఆందోళన

వరంగల్, అక్టోబర్ 14 : నగరంలో కలుషిత తాగునీరు సరఫరా అవుతున్నా బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదని జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగు మారిన తాగునీటితో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో 29వ డివిజన్‌కు చెందిన మహిళలు బల్దియా ఎదుట ఆందోళన చేశారు. పది రోజులుగా ఆకుపచ్చ రంగులో తాగునీరు సరఫరా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సింగారపు బాబు, అరూరి కుమార్, శ్రీనివాస్, రంగరాజు, రమేశ్, లక్ష్మణ్, రేణుక పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల రక్షణలో

బీఐఎస్ పాత్ర ఎంతో ముఖ్యం

డాక్టర్ పల్లెపాడు దామోదర్

పోస్టర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్ పల్లెపాడు దామోదర్

నయీంనగర్, అక్టోబర్ 14 : వినియోగదారుల హక్కుల రక్షణలో భారత ప్రమాణాల సంస్థ(బీఐఎస్)ది ఎంతో ముఖ్యమైన పాత్ర అని ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. సోమవారం ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా రాంనగర్‌లో జిల్లా వినియోగదారుల చైతన్య సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన అందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. పరిశ్రమలు ఉత్పత్తి చేసే వస్తువులు, సరుకులు రసాయలు, సిమెంట్, ఇనుము, వెండ